27న ఐటిఐ కౌన్సెలింగ్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా కేంద్రంలోని బలగ ప్రభుత్వ డిఎల్‌టిసి (ఐటిఐ)కు రెండో విడతలో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 27న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం తొమ్మిది గంటలకు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

పింఛన్.. ఎప్పుడు వచ్చేన..!



కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తొలిసారి ఈనెల ఒకటో తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందించే కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వృద్ధాప్య పింఛన్ సొమ్ము మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచి ఇవ్వడంతో పాటు మూడు నెలల బకాయిలనూ అందించింది. ప్రతి నెలా ఇంటికే పింఛన్లు ఇస్తామని... మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్ని పనులు ఉన్నా పంపిణీ రోజున కచ్చితంగా పాల్గొనాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇటీవల ఓ సమావేశంలో ప్రజాప్రతినిధులకు సైతం సూచించారు. పింఛన్ల అందజేతకు ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, కొత్తవి మంజూరు చేసే విషయంలో మాత్రం దృష్టిసారించడం లేదు. గత ప్రభుత్వం ఐడి లాగిన్ ఇవ్వకపోవడంతో ఫిబ్రవరి నుంచి కొత్త దరఖాస్తుల ప్రక్రియ నిలిచిపోయింది. దీంతో అర్హులైన వేలాది మంది పింఛన్లకు నోచుకోలేకపోతున్నారు.

- ఆరు నెలలుగా మంజూరు కాని కొత్త పింఛన్లు
- దరఖాస్తుల అప్‌లోడింగ్‌కూ అవకాశం లేని పరిస్థితి
- ఫిబ్రవరి నుంచి నిలిచిన కొత్త దరఖాస్తుల స్వీకరణ
- వేలాది మంది ఎదురుచూపులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి, ఆమదాలవలస

జిల్లాలో జూలైలో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు తదితర కేటగిరీలకు సంబంధించి 3,19,119 మంది లబ్ధిదారులకు రూ.211.69 కోట్లను ప్రభుత్వం పంపిణీ చేసింది. టిడిపి కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలోని ఇచ్చిన హామీ మేరకు వృద్ధుల పింఛన్ మొత్తాన్ని రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలకు పెంచడంతో పాటు ఏప్రిల్ నుంచి జూన్ వరకు మూడు నెలల బకాయిలు చెల్లించింది. వికలాంగులు, లెప్రసీ, కిడ్నీ, తలసేమియా తదితర వ్యాధిగ్రస్తులకు పింఛన్ సొమ్మును రెండింతలు చేసి జూలైలో అందించింది. దీంతో జూన్‌లో రూ.93.30 కోట్లు పంపిణీ చేయగా, జూలైలో అదనంగా రూ.118.39 కోట్లను అదనంగా ఇచ్చింది. ఇంతవరకు బాగానే ఉన్నా కొత్త పింఛన్ల మంజూరుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించకపోవడంతో అర్హులైన లబ్ధిదారుల పింఛన్ల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.

దరఖాస్తుల అప్‌లోడింగ్‌కూ అవకాశం లేని పరిస్థితి

పింఛన్ల మంజూరులో గత ప్రభుత్వం కొత్త విధానం అమలు చేసింది. నవశకం పేరుతో లబ్ధిదారుల నుంచి సచివాలయాల ద్వారా దరఖాస్తులను స్వీకరించేది. ఏడాదికి రెండు పర్యాయాలు కొత్త పింఛన్లను మంజూరు చేసేది. జనవరి నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి జూలైలో పింఛన్లు ఇచ్చేది. జూలై తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి జనవరిలో కొత్త పింఛన్లు మంజూరయ్యేవి. 2024 జనవరిలో అప్పటి ప్రభుత్వం సుమారు ఏడు వేల మందికి కొత్త పింఛన్లను మంజూరు చేసింది. వైసిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నా ఫిబ్రవరి తర్వాత కొత్త పింఛన్ల అప్‌లోడింగ్ కోసం సచివాలయాలకు ఐడి లాగిన్ ఇవ్వలేదు. దీంతో అప్పట్నుంచి ఇప్పటివరకు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకుండా పోయింది.

పింఛన్ విధానంలో మార్పులు ఉంటాయా?

ప్రస్తుత పింఛన్ విధానంలో కొత్త మార్పులు ఉండొచ్చనే ప్రచారం జరుగుతోంది. 2014-19 కాలంలో టిడిపి ప్రభుత్వం కొత్త పింఛన్ల మంజూరుకు లబ్ధిదారుల దరఖాస్తులను స్వీకరించి, అర్హులైన వారికి ఒకట్రెండు నెలల వ్యవధిలోనే మంజూరు చేసేది. ప్రస్తుతం ఏవైనా కారణాలతో లబ్ధిదారులు ఒక నెల ఫించన్ అందుకోలేకపోతే, రెండో నెలలో ఆ మొత్తాన్ని ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. టిడిపి ప్రభుత్వ హయంలో ఈ పరిస్థితి ఉండేది కాదు. దీన్ని మార్పు చేసే అవకాశం ఉండవచ్చన్న చర్చ నడుస్తోంది. తాము అధికారంలోకి వస్తే బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు 50 ఏళ్లకే పింఛను అందిస్తామని కూటమి నాయకులు ఎన్నికల ప్రచారంలో హామీనిచ్చారు. దీనిపై ప్రభుత్వం ఏం నిర్ణయం తీసుకుంటుందోనని అంతా ఎదురుచూస్తున్నాను.

కొత్త ప్రభుత్వం నిబంధనలను సమీక్షిస్తుందా?

పింఛన్లు పొందడానికి గత ప్రభుత్వం అనేక నిబంధనలు విధించింది. పల్లం భూమి మూడు ఎకరాలు లేక మెట్టు పది ఎకరాలకు మించి ఉన్న వారిని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని, కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వాడిని వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులని తెలిపింది. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తున్నా వారిని అనర్హులుగా పేర్కొంది. కొత్త మంజూరు చేయకపోగా అప్పటివరకు పింఛన్లు పొందుతున్న వారిని జాబితా నుంచి తొలగించింది. కొత్త ప్రభుత్వం ఈ నిబంధనలను సమీక్షిస్తుందా, వాటినే కొనసాగిస్తుందా అనేది చూడాల్సి ఉంది.

కాళ్లరిగేలా తిరుగుతున్నాను

పింఛన్ కోసం రెండేళ్లుగా కాళ్లరిగేలా తిరుగుతున్నాను. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి మొరపెట్టుకున్నా ఫలితం కనిపించలేదు. వయసు 65 ఏళ్లు దాటడంతో కూలి పనులకూ వెళ్లలేకపోతున్నాను. కొత్త ప్రభుత్వమైనా మంజూరు చేస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నాను.

- చింతాడ తవిటినాయుడు, సరుబుజ్జిలి

ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో బిసిలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీనిచ్చింది. నాతోపాటు చాలామంది 50 ఏళ్లు దాటిన వారెందరో ఉన్నారు. పింఛన్ సొమ్ము అందిస్తే చేదోడువాదోడుగా ఉంటుంది.

- కూర్మాపు రమణ, పురుషోత్తపురం

నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

కార్మికులపై వేధింపులు ఆపాలి

- మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్
- మస్టరు పాయింట్ల వద్ద పారిశుధ్య కార్మికుల నిరసన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మున్సిపల్ కార్మికులపై వార్డు సెక్రటరీలు, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీల వేధింపులు ఆపాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేశారు. ఇవే డిమాండ్లపై ఫెడరేషన్ ఆధ్వర్యాన నగరంలోని మస్టరు పాయింట్ల వద్ద పారిశుధ్య కార్మికులు బుధవారం నిరసన చేపట్టారు. ఏడురోడ్ల కూడలి సమీపాన గల మస్టరు పాయింట్ వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో బలరాం మాట్లాడుతూ చనిపోయిన కాంట్రాక్టు కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పనిభారం పెరుగుతోందని తెలిపారు. నగర పరిధి విస్తరించినా కార్మికుల సంఖ్యను పెంచకుండా ఉన్న వారితోనే వెట్టిచాకిరీ చేయిస్తున్నారని విమర్శించారు. పర్మినెంట్ కార్మికుల సరెండర్ లీవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికుల విధి నిర్వహణకు అవసరమైన పనిముట్లు లేకుండా ఎలా పనిచేయాలని ప్రశ్నించారు. దీనిపై పలుమార్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని విమర్శించారు. మస్టరు పాయింట్ల వద్దే ఎఫ్ఆర్ఎస్ తీయాలని, కార్మికులకు పనిముట్లు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మికులకు క్షేత్రస్థాయిలో ఇన్‌స్పెక్టరు, వార్డు సెక్రటరీ, టిడిపి వార్డు ఇన్‌ఛార్జీలు వేర్వేరు పనులు చెప్తున్నారని, ఒకే వ్యక్తి ఇన్ని పనులు చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. వారిలో ఏ ఒక్కరి పని చేయలేకపోయినా కార్మికులపై ఒత్తిడి తెచ్చి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెప్పారు. నగరంలోని సులభ్ కాంప్లెక్స్‌లను కాంట్రాక్టర్లు నిర్వహించాల్సి ఉన్నా, పారిశుధ్య కార్మికులకు వార్డు సెక్రటరీలు బలవంతంగా ఈ పనులు అప్పగిస్తున్నారని తెలిపారు. ఇటువంటి చర్యలపై కమిషనర్ జోక్యం చేసుకోవాలని కోరారు. నిరసన కార్యక్రమంలో ఫెడరేషన్ నగర అధ్యక్షులు ఎ.గణేష్, నాయకులు ఎ.రాము, ఎ.జనా, డి.యుగంధర్, ఎ.శంకర్, ఎన్.పార్వతి, ఆర్.ఈశ్వరమ్మ, ఎ.గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో అంగవైకల్యం ఉన్న ప్రీమెట్రిక్, పోస్టుమెట్రిక్ విద్యార్థులు 2024-25 విద్యా సంవత్సరానికి గానూ జాతీయ స్థాయిలో ఉపకార వేతనం పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని వికలాంగుల శాఖ ఎడి కె.కవిత ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 31వ తేదీ లోగా అర్హులైన ప్రీమెట్రిక్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పోస్టుమెట్రిక్ విద్యార్థులు ఈ ఏడాది సెప్టెంబరు 30వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కోసం పనివేళల్లో కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైస్ ఛాన్సలర్ రజని

ఆగస్టు 30, 31న జాతీయ సెమినార్

బిఆర్ఎయు విసి కె.ఆర్ రజని

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం (డిసిఎంఎస్) ఆధ్వర్యాన ఆగస్టు 30, 31 తేదీల్లో 'డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, హ్యూమన్ రీసోర్స్ మేనేజ్‌మెంట్' అంశంపై జాతీయ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు వర్శిటీ వైస్ ఛాన్సలర్ కె.ఆర్ రజని తెలిపారు. ఈ సెమినార్‌కు సంబంధించిన పోస్టర్‌ను తన ఛాంబరులో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగానికి చెందిన సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ కె.అచ్యుతరావు కన్వీనర్‌గా ఈ సెమినార్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వర్శిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.అనురాధ పాల్గొన్నారు.

వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

విస్తృతంగా వాహన తనిఖీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలోని పలు మండలాల్లో పోలీసులు బుధవారం విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి, నాటుసారా, మద్యం వంటి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ప్రధాన రోడ్డు మార్గాలు, ముఖ్యమైన కూడళ్లలో వాహనాలు తనిఖీలు చేస్తూ రోడ్డు భద్రతా నియమాలు ఉల్లంఘించిన వారికి జరిమానాలు విధించారు. ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. శ్రీకాకుళం నగరంలో ట్రాఫిక్ సిఐ ఎం.అవతారాం, ఎస్ఐ సందీప్ కుమార్ సిబ్బందితో హెల్మెట్ ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మాతా శిశు మరణాల నివారణే ధ్యేయం

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా కిల్కారి సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి తెలిపారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆశా నోడల్ అధికారులకు కిల్కారి మొబైల్ అకాడమీ సేవలపై జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాయిస్ కాల్స్ సేవలతో మాతా శిశు ఆరోగ్యానికి భద్రత, గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యంపై ప్రభుత్వం దృష్టిసారించినట్లు తెలిపారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన ఆహార నియమాలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై అప్రమత్తం చేసేందుకు కిల్కారి పేరిట వాయిస్ కాల్స్ అందించనున్నట్లు చెప్పారు. మహిళలు గర్భవతిగా ఉన్నప్పుడు స్థానిక ఎఎన్ఎం వద్ద గర్భస్థ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. మొబైల్ నంబరుకు ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వస్తాయని, గర్భిణుల్లో తలెత్తే ఎన్నో సందేహాలను నివృత్తి చేసే విధంగా ఈ వాయిస్ కాల్ సందేశం ఉంటుందన్నారు. గర్భం దాల్చిన నాలుగో నెల నుంచి పాలిచ్చే తల్లుల వరకు, బిడ్డకు ఏడాది వయసు వచ్చే వరకు 72సార్లు వాయిస్ కాల్స్ సందేశాలు వచ్చేలా కిల్కారి కార్యక్రమాన్ని డిజైన్‌ను రూపొందించినట్లు వివరించారు.

గర్భిణులు, పాలిచ్చే తల్లుల మొబైల్‌కు డాక్టర్ అనిత వాయిస్‌తో ఆరోగ్యపరమైన సూచనలు, తీసుకోవాల్సిన పోషకాహారం, చేయించుకోవాల్సిన వైద్య పరీక్షలు వంటి అంశాలను వివరిస్తారు. ఈ కాల్ సమయం సుమారు 1.40 నిమిషాలు ఉంటుందని తెలిపారు. ఆర్‌సిహెచ్ పోర్టల్‌లో నమోదైన ప్రతి గర్భిణికి 01244451660 నంబరు నుంచి వాయిస్ కాల్ వస్తుందన్నారు. ఒకవేళ ఫోన్ ఎత్తడం మిస్ అయితే, ఐవిఆర్ వ్యవస్థ సిస్టమ్ ఆటోమేటిక్‌గా ఒకేరోజు మూడుసార్లు ఫోన్ కాల్ వచ్చేలా చేస్తుందన్నారు. మళ్లీ ఆ సందేశాన్ని వినాలనుకుంటే 14423 టోల్ ఫ్రీ నంబరుకు డయల్ చేసి వినవచ్చని చెప్పారు. ఆశా కార్యకర్తల విజ్ఞానాన్ని బలోపేతం చేయడానికి మొబైల్ అకాడమీ కోర్సును 11 మాడ్యూల్స్ ద్వారా అందించేందుకు రూపకల్పన చేశారని తెలిపారు. 14424 టోల్ ఫ్రీకి డయల్ చేస్తే కోర్సులో చేరేందుకు దోహదపడుతుందన్నారు. తల్లీ బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించే ఈ బృహత్తర కార్యక్రమం గురించి గర్భిణులకు అవగాహన కల్పించే దిశగా ఆశా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో స్టేట్ ప్రోగ్రాం మేనేజరు ఎల్.రాజు, రీజనల్ ప్రోగ్రాం అధికారి ఆర్.మోహనరావు, ముఖలింగం, శైలజ, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఎన్నికల కోలాహలం

ప్రజాశక్తి - పలాస

16 ఏళ్ల తర్వాత ఈస్ట్‌కోస్టు రైల్వేలో కోపరేటివ్ అర్బన్ బ్యాంకు ఎన్నికలు నిర్వహిస్తుండడంతో కోలాహలం నెలకొంది. బుధవారం నుంచి నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ గురువారంతో ముగుస్తుంది. ఈ ఎన్నికలకు సంబంధించి ఖుర్దా రోడ్ డివిజన్ పరిధిలో పలాస రైల్వేస్టేషన్ ఆవరణలో రైల్వేస్టేషన్ మేనేజర్ కార్యాలయం వద్ద రెండు, ఇంజినీరింగ్ కార్యాలయం వద్ద ఒక పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మొత్తం 630 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. శ్రామిక్ కాంగ్రెస్ యూనియన్ నుంచి జె.తేజేశ్వరరావు, డి.శ్యామసుందర్, ఎం.ఎస్ ప్రసాద్, శ్రామిక్ యూనియన్ నుంచి ఎల్.మోహనరావు, పి.వి.ఎన్‌రావు, పి.ఎస్ రావు పోటీ పడుతున్నారు. ఈనెల 26వ తేదీన ఫలితాలను ప్రకటిస్తారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి - రణస్థలం రూరల్

మంత్రి రవీంద్రకు సమస్యలు వివరిస్తున్న ఎన్ఇఆర్

రణస్థలం మండలంలో సాగుతున్న అక్రమ మైనింగ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మైన్స్, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్రను ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కోరారు. అమరావతిలోని మంత్రి ఛాంబరులో బుధవారం కలిసి నియోజకవర్గానికి చెందిన పలు అంశాలపై వినతిపత్రం అందజేశారు. మండలంలోని కొవ్వాడ అణువిద్యుత్ పునరావాస కాలనీ నిర్మాణం, 18 ఏళ్లు నిండిన మత్స్యకార యువకులకు ఆర్ఆర్ ప్యాకేజీ అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యల పరిష్కారం దిశగా చర్యలకు ఆదేశాలు జారీ చేస్తానని మంత్రి హామీనిచ్చారు. ఎమ్మెల్యే వెంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ మాజీ ఛైర్మన్ వి.సురేష్ కుమార్, మాజీ సర్పంచ్ మైలపల్లి పోలీసు, గిరి తదితరులున్నారు.

ఎస్‌పిని కలిసిన పలువురు అధికారులు

మొక్కను అందజేస్తున్న ప్రజా రవాణాధికారి విజయ్ కుమార్

శ్రీకాకుళం : జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డిని పలువురు అధికారులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా విజిలెన్స్ ఎస్‌పి ఎ.సురేష్‌బాబు, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఎ.చంద్రశేఖర్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ సిహెచ్.తిరుపతి నాయుడు, ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్, శ్రీకాకుళం ఒకటి, రెండో డిపో మేనేజర్లు మల్లికార్జునరాజు, శర్మ కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం సంబధిత విభాగాలకు సంబంధించిన పలు అంశాలపై కాసేపు చర్చించారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యులు, ఎక్స్ ఆర్మీ సర్వీస్‌మెన్ సంఘ సభ్యులూ ఎస్‌పిని కలిసిన వారిలో ఉన్నారు.

29, 30న క్యాంపస్ ఎంపికలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఆదిత్య డిగ్రీ, పిజి కళాశాలలో ఈనెల 29, 30 తేదీల్లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.విజయ్‌కుమార్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. పుణెలోని హానర్ ఫార్మా కంపెనీలో ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, క్వాలిటీ ఎస్యూరెన్స్, స్టోర్స్, సేఫ్టీ పర్చేజ్ విభాగాల్లో ఉద్యోగ నియామకాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2023-24 విద్యా సంవత్సరంలో బిటెక్ మెకానికల్, బిఫార్మసీ, ఎంఫార్మసీ, బిఎస్‌సి కెమిస్ట్రీ, బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్, ఎంఎస్‌సి ఆర్గానిక్, ఎనలిటికల్ కెమిస్ట్రీ, పాలిటెక్నిక్, బిఎ, బికాం, ఐటిఐల్లో ఉత్తీర్ణులైన వారు ఈ ఇంటర్వ్యూల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఎంఎస్‌సి విద్యార్హత కలిగిన మహిళా అభ్యర్థులకూ నియామకాల్లో అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. వార్షిక వేతనం ఏడాదికి రూ.2.4 లక్షల నుంచి రూ.3.06 లక్షల వరకు ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు ఉచిత వసతి, భోజనం, రవాణా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులు కంపెనీకి ఒరిజినల్ సర్టిఫికెట్లు, డిపాజిట్ ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 27వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోగా 73370 41426 ఫోన్ నంబరుకు రూ.100 ఫోన్ పే చేసి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. గతేడాది ఇదే సంస్థ నిర్వహించిన ఇంటర్వ్యూల్లో 40 మంది ఉద్యోగాలు పొందారని, వారిలో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ విద్యార్థులు 16 మంది ప్రస్తుతం ఉద్యోగాల్లో ఉన్నారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం 93922 55211, 90301 94567, 9966255963, 73370 41426 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు. ఫార్మా రంగంలో పనిచేయాలనే ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఓబులేసు

ఖాళీ ప్రదేశాలే దోమల వృద్ధి కేంద్రాలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నగరపాలక సంస్థ పరిధిలోని విలీన పంచాయతీల్లో ఖాళీ ప్రదేశాల్లో పెద్దఎత్తున వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని నగరపాలకసంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు అన్నారు. ఖాళీ ప్రదేశాల్లో మట్టితో నింపుకుని గోతులు లేకుండా చూడాల్సిన బాధ్యత స్థల యజమానులపై ఉందని చెప్పారు. తక్షణమే సంబంధిత స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని వార్డు సెక్రటరీని ఆదేశించారు. విశాఖ-ఎ కాలనీలో బుధవారం పర్యటించిన ఆయన దృష్టికి స్థానికులు పలు సమస్యలను తీసుకెళ్లారు. ఎటువంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉన్న స్థలాల్లో మురుగునీరు నిల్వ ఉంటోందని వివరించారు. కాలనీ మధ్యలో ఉన్న మురుగునీటి కాలువల ఆక్రమణలతో వ్యర్థ నీరు వర్షం పడితే రోడ్లపై ప్రవహిస్తోందని చెప్పారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించేందుకు సహకరించాలని కమిషనర్‌ను కోరారు. ఆయన వెంట టిడిపి నాయకులు ముద్దాడ రామకృష్ణ, వార్డు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే ఎంజిఆర్

రైతుబజారు ఏర్పాటు చేయాలి
మంత్రి అచ్చెన్నను కోరిన ఎమ్మెల్యే ఎంజిఆర్

పాతపట్నం: రైతులు పండించే కూరగాయలు నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్మేందుకు వీలుగా నియోజకవర్గ కేంద్రంలో రైతుబజార్ ఏర్పాటుకు సహకరించాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును సచివాలయంలో కలిసి ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. కొత్తూరు మండల కేంద్రంలో రైతులు పండించే పంటలు నిల్వ ఉంచేందుకు కోల్డ్ స్టోరేజ్ మంజూరు చేయాలని కోరగా సానుకూలంగా మంత్రి స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరావు

నూతన నిర్మాణ పద్ధతులపై అవగాహన

ప్రజాశక్తి- పలాస

నూతన భవన నిర్మాణ పద్ధతులపై లైసెన్స్ టెక్నికల్ పర్సన్లకు అవగాహన కార్యక్రమాన్ని స్థానిక కెడిఆర్ ఏ పంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఆ సంఘ జిల్లా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లాలో మున్సిపల్ టెక్నికల్ పర్సన్స్, ప్రైవేట ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎస్.జగదీశ్వరరావు, పలాస అధ్యక్షుడు ఉప్పు వెంకటరావు మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా ఇంజనీరింగ్ పద్ధతులు మార్పొల్పి ఉంటుందన్నారు. భవన నిర్మాణంలో, ఇతర నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయాలని సూచించారు. సిమెంట్, ఐరన్ వంటి వస్తువులు ఐఎస్ఐ మార్కు ఉన్నవే కొనుగోలు చేసి నిర్మాణదారులకు నష్టం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత టెక్నికల్ పర్సన్లపై ఉందన్నారు. ఈ సందర్భంగా టాటా కంపెనీకి చెందిన వివిధ వస్తువులను వినియోగించడంపై అవగాహన కల్పించారు. టాటా సంస్థ కేవలం లాభాలే కాకుండా జాతి ప్రయోజనాలు కలిగించే విధంగా సంక్షేమానికి నిధులు వినియోగిస్తుందని సంబంధిత నిర్వాహకులు వివరించారు. అనంతరం పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా నూతన భవన నిర్మాణ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో బెల్లల వెంకటరావు, టొక్క కృష్ణారావు, శాసనపురి సందీప్, దుంగ జగదీష్, ఎం.ఎస్.విజయకుమార్, వాసు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్

హెల్మెట్ ధారణతో ప్రాణాలు పదిలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హెల్మెట్‌ధారణతో ప్రాణాలకు రక్షణ కవచంగా నిలుస్తుందని ట్రాఫిక్ ఎస్ఐ మెట్ట సుధాకర్ అన్నారు. జెసిఐ శ్రీకాకుళం మెయిన్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న జెసిఐ వారోత్సవాల్లో భాగంగా ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నగరంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై హెల్మెట్‌ధారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. గమ్యానికి త్వరితగతిన చేరుకోవాలన్న ఆలోచనతో వేగంగా వాహనాలు నడపడం వలన తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. వాహనాలు నడిపే వారు తగిన ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. కార్యక్రమంలో జెసిఐ అధ్యక్షులు కూన అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న ఎఇ రాజశేఖర్

సాగునీటిని సద్వినియోగం చేసుకోవాలి

వజ్రపుకొత్తూరు: రైతులు సమన్వయంతో వంశధార నీటిని సద్వినియోగం చేసుకోవాలని వంశధార ఎఇ తమ్మినాన రాజశేఖర్ అన్నారు. బుధవారం పెద్దబొడ్డపాడు ఊటీ నుంచి సీతాపురం ఎర్ర చెరువులోకి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంశధార నీటిని ముందుగా చెరువులను నింపాలని, వంశధార ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఉన్నాయని తెలిపారు. ప్రస్తుతం పెద్దబొడ్డపాడు రామసాగరంలోకి సాగునీరు పూర్తి నీటిమట్టంతో చేరిందన్నారు. సీతాపురం ఎర్ర చెరువు నిండాల్సి ఉందన్నారు. చిరుజల్లులు పడుతుండడం, ఉబాలు లేకపోవడంతో సాగునీరు కిందికి విడిచి పెడుతున్నట్లు తెలిపారు. కొండపురం ఊటీ వద్ద సాగునీటికి అక్కడ రైతులు ఇబ్బంది కలిగిస్తున్నారని ఎఇ దృష్టికి రైతులు తీసుకెళ్లారు. కొండపురం ఊటీ రైతులతో ఎఇ మాట్లాడారు. అధికారుల అనుమతి లేకుండా సాగునీరు తీయరాదని సూచించారు. సాగునీటికి ఇబ్బందులు కలిగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. రైతులు తమ్మినాన బాలకృష్ణ, ఇప్పాడ కృష్ణారావు, తమ్మినాన తులసీదాస్, హనుమంతు అప్పలస్వామి, టి. చంద్రశేఖర్, తమ్మినాన రామయ్య, బమ్మిడి చంద్రశేఖర్, టి.జగ్గారావు, మల్లేశ్వరరావు, టి. వాసు పాల్గొన్నారు.

పోలీసుల పర్యవేక్షణలో పొగరుతీత పనులు

వజ్రపుకొత్తూరు: నువ్వలరేవు పొగరు (ఇసుకమేట)తీత పనులు బుధవారం పోలీసుల పర్యవేక్షణలో చేపట్టారు. బెండిగెడ్డ వరదనీరు భారీగా రావడంతో సోమవారం ఇసుకమేట వేయడంతో సముద్రంలోకి నీరు వెళ్లక నువ్వలరేవు గ్రామం చుట్టుముట్టింది. పరిసర గ్రామాలకు చెందిన పంట పొలాలు నీటిలో మునిగాయి. దీంతో సిఐ ఈశ్వరరావు, ఎస్ఐ నిహార్ రామారావు పర్యవేక్షణలో పొగరుతీత పనులను పర్యవేక్షించారు. సముద్రానికి, గ్రామానికి మధ్య ఏర్పడిన ఇసుకమేటను జెసిబితో తొలగించారు. ఉప్పునీరు ఉప్పునీటి పరిసర గ్రామాలకు చెందిన పొలాల్లోకి చేరడంతో పంటతో పాటు ఉప్పు పట్టి పొలం కూడా పాడవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణలో పొగరు తొలగించడంతో నువ్వలరేవు గ్రామస్తులు పరిసర గ్రామాలకు చెందిన రైతులు ధన్యవాదాలు తెలిపారు.

పర్యవేక్షిస్తున్న పోలీస్ సిబ్బంది

ఘనంగా 'అయ్యంకి' జయంతి

లావేరు : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి, విద్యార్థులు

సంతబొమ్మాళి : నివాళ్లర్పిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న కుమార్‌రాజా తదితరులు

పలాస : చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎంఇఒ తదితరులు

టెక్కలి : నివాళ్లర్పిస్తున్న గ్రంథాలయాధికారి తదితరులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రంథాలయ ఉద్యమ పితామహుడు అయ్యంకి వెంకట రమణయ్య 134వ జయంతి బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యంకి వెంకట రమణయ్య 24 జులై 1890లో తూర్పు గోదావరి జిల్లా రామచంద్రాపురం తాలూకా బిక్కవోలు మండలంలో జన్మించారన్నారు. గ్రంథాలయ ఉద్యమంలో జీవితాంతం విశేష కృషి చేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వి.వి.జి.ఎస్ శంకరరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పి.వి. భాస్కరరాజా, గ్రంథాలయ సిబ్బంది ప్రత్యూష, రామమోహన్, రిటైర్డ్ జూనియర్ అసిస్టెంట్ చిరంజీవులు, పాఠకులు పాల్గొన్నారు.

బలగ హడ్కోకాలనీ శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణ జయంతి నిర్వహించారు. గ్రంథాలయాధికారి పి.ఉగ్రసేను చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. సహాయకులు కె.అనిత, పాఠకులు పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి వేడుకలు జరిగాయి. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను గ్రంథాలయాధికారి అందజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి జరిగింది. ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.రామకృష్ణ పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బాబురావు, పాఠకులు ఉమామహేష్, నారాయణ, రాజు, శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆమదాలవలస: స్థానిక శాఖా గ్రంథాలంలో అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి గ్రంథాలయాధికారి కోటేశ్వరరావు పూలమాల వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జయలక్ష్మి, పాఠకులు షణ్ముఖ ఆంజనేయులు, నారాయణ, రాజు, శంకర్ పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ గ్రంథాలయంలో అయ్యంకి చిత్రపటానికి ఘనంగా నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంఇఒ సిహెచ్ శ్రీనివాసరావు, గ్రంథాలయాధికారి వై.రాంబాబు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ పోతనపల్లి బాలరాజు, శివ, శేషగిరి, కేశవరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

పాతపట్నం: స్థానిక శాఖ గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వి.జోగారావు, జిఎంఎస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ వాసుదేవరావు, వార్డ్ మెంబర్ పి.రాము, గ్రంథాలయాధికారి కాళ్ల రాజు పాల్గొన్నారు.

టెక్కలి: స్థానిక గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.రూపావతి అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.పాఠకులు సీతాపతి, సాంబమూర్తి, నాగభూషణరావు, గవిరేస్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి: స్థానిక శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి సందర్భంగా గ్రంథాలయాధికారి ఆర్.అనురాధ చిత్రపటానికి పూల మాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, నలంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

మండలంలో లింగాలవలస ఫీడర్ పరిధిలో గురువారం సీతాపురం, తిర్లంగి, పోలవరం, లింగాలవలసకు విద్యుత్ నిలుపుదల చేయనున్నట్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు తెలిపారు. మరమ్మతులు, 11 కె.వి వార్షిక మరమ్మతులు చేయడంతో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

మండలంలోని 11 కెవి రొట్టవలస ఫీడర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు తొలగించుట నిమిత్తం 26న ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రొట్టవలస, పాలవలస, కొండవలస, పెద్దపాలెం, వెంకటాపురం, పురుషోత్తపురం,

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

అలమాజీపేట గ్రామాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ గమనించి విద్యుత్ శాఖ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆమదాలవలస: మండలంలోని తొగరాం 33/ 11 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో జి.కె. వలస, దూసి ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని ఇఇ బయ్యన్నాయుడు ప్రకటనలో తెలిపారు. మండలంలో నిమ్మతొర్లాడ, జి.కె.వలస, కొరపాం, చేపేనపేట, పాతూరు, కొర్లకోట, చీమల వలస, హనుమంతు పురం, కట్యాచార్యులపేట, వెదుళ్లవలస, తురకపేట, నెల్లిపర్తి, కలివరం, ముద్దాడపేట, పీర్ సాహెబ్ పేట, దూసిపేట తదితర గ్రామాలకు సరఫరా నిలిపి వేయనున్నట్టు తెలిపారు.

పట్టణ పరిధిలోని 33/11 కె వి సొట్టవానిపేట సబ్‌స్టేషన్ పరిధిలో 26న 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ తెలిపారు. పంతులుపేట, సొట్టవాని పేట, ఎఫ్‌సిఐ, కాళింగ మన్నయ్యపేట, తెలగ మన్నయ్య పేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవాని పేట, నాదానపురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునన్నారు.

పలాస: పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జిఎంఇ కాలనీ, రామకృష్ణాపురం, పెంటిభద్ర, జయ రామచంద్రపురం, పద్మనాభపురం, నీలాపురం కాలనీ, తాళభద్ర, నర్సింపురం, చిన్న బడం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, అంతరకుడ్డ, రాజాం, పాత జాతీయ రహదారి తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఇఇ జి.ప్రసాదరావు తెలిపారు. చిన్నబడాం 11 కెవి ఫీడర్ మరమ్మతులు చేపడుతున్నందున సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

గాజుల దుకాణం నుంచి వస్తున్న పొగలు

గాజుల దుకాణంలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని జిటి రోడ్డులో పరమేశ్వరి బేంగిల్స్ అండ్ ప్యాన్సీ దుకాణంలో బుధవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. సుమారు రూ.10 లక్షల మేర ఆస్తినష్టం సంభవించిందని అంచనా. విద్యుత్ షార్టు సర్క్యూట్ వలనే ఈప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెపుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే వీనస్ హోటల్ పక్కనే ఉన్న ఈ దుకాణంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. గాజులు, ఇతర గాజు వస్తువులు అందులో ఉండడంతో పేలుడు శబ్దాలు రావడంతో స్థానికులు పరుగులు తీశారు. అంతలోనే పక్కనే ఉన్న వీనస్ హోటల్, మేడపై ఉన్న సాంప్రదాయం ఎటుజెడ్, సిటీ స్టైల్ బట్టల దుకాణం అంతటా పొగలు కమ్మేశాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇద్దరు స్వల్ప గాయాలతో బయట పడ్డారు.

అధికారులపై దాడి కేసులో జైలుశిక్ష

ప్రజాశక్తి- పలాస

అధికారులపై దాడి చేసిన కేసులో ముగ్గురు వ్యక్తులకు జూనియర్ సివిల్ కోర్టు ఆరు నెలలు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించినట్లు కాశీబుగ్గ సిఐ విజయనంద్ తెలిపారు. మండలం రేగులపాడులో నిర్మిస్తున్న ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులకు పునరావాస కాలనీ నిర్మించడానికి 50 ఎకరాల స్థలం టెక్కలిపట్నం పరిసర ప్రాంతంలో కేటాయించారు. సన్న, చిన్నకారు రైతులున్నారని, భూసేకరణ 20 ఎకరాలకు తగ్గించేందుకు విఆర్ఒ, సర్వేయర్ పరిశీలన నిమిత్తం భూమిపైకి 2017లో వెళ్ళారు. టెక్కలి పట్నం, కమలాపురంకు చెందిన రైతులు అధికారులను అడుకున్నారు. అక్కడితో ఆగకుండా వారిపై దాడిచేశారు. జరిగిన సంఘటనపై అప్పటి తహశీల్దారు కల్యాణ చక్రవర్తి కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి సిఐ అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా పలాన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు ఎపిపి పి.రమేష్ వాదనతో జడ్జి యు.మాధురి విచారణ చేయగా టెక్కలిపట్నంకు చెందిన కె.నందకుమార్, జోగ.పార్వతి, కమలా పురానికి చెందిన మడ్డు రంగారావులకు ఆరు నెలలు జైలు శిక్ష, రూ. 500 జరిమాన విధించినట్లు ఆయన తెలిపారు.

దత్తత విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకం

పొందూరు: అమెరికాకు చెందిన తెలుగు దంపతులు రామ్ మైనేని, సుష్మాలు తాడివలస పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను గత కొన్నేళ్లుగా దత్తత తీసుకుని చదివిస్తున్నారు. వారిలో పదో తరగతి పూర్తిచేసిన ఇద్దరు విద్యార్థినిలు మెట్ట లక్ష్మి, కూన రేవతిలకు పంపిన నగదు బహుమతిని హెచ్‌ఎం బల్ల కంటయ్య అందజేశారు. ప్రస్తుతం రూ.8 వేలు నగదును ఒకొక్కరికి అందజేశారు. వీరితో పాటు మరో నలుగురు విద్యార్థినుల చదువులకు అవసరమైన ఆర్థికసాయాన్ని చేస్తున్నారు. వారి ఉన్నత చదువులకు సహాయపడుతున్నారని హెచ్‌ఎం తెలిపారు.

చిన్నారులకు ఐరన్ సిరప్

ఇచ్ఛాపురం: మండలంలో మండపల్లి గ్రామ పంచాయతీలో ఉన్న భవానీపురం అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు ఐరన్ సిరఫ్ వేశారు. బుధవారం అంగన్వాడీ కేంద్రంలో అంటువ్యాధులు ప్రబలకుండా చిన్నారులకు ఐరన్ సిరఫ్ వేసారు. అంగన్వాడీ కార్యకర్త నరసమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ గోపి బాల

సకాలంలో ఒడిఎఫ్ సర్వే పూర్తి

ఆమదాలవలస: మండలంలోని 30 గ్రామ పంచాయతీల్లో ఉన్న వివిధ గ్రామాల్లో నిర్వహించాల్సిన ఒడిఎఫ్ పల్స్ సర్వే సకాలంలో పూర్తి చేయాలని డిఎల్‌పిఒ ఆర్.గోపి బాల అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఎస్.వాసుదేవరావు ఆధ్వర్యంలో కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో అపారశుధ్యం ఏర్పడి విషజ్వరాలు, వివిధ రోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులందరూ ఒడిఎఫ్ సర్వే ద్వారా గ్రామాల్లో ఉన్న ప్రతి ఇంటికి మరుగుదొడ్లు ఉన్నవి, లేనివి గుర్తించి సమగ్ర నివేదికలు పంపించాలన్నారు. అలాగే పారిశుధ్యంపై ప్రత్యేక చర్యలు చేపట్టి అంటు రోగాల భారి నుండి ప్రజలను కాపాడాల్సిన బాధ్యత ఉద్యోగులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి దుంపల గోవిందరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ చంద్రమౌళి, కామేశ్వరరావు పాల్గొన్నారు.

బడ్జెట్‌తో రాష్ట్రానికి ప్రయోజనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రాధాన్యతనివ్వడం ఆనందదాయకమని జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ ప్రకటనలో తెలిపారు. రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు సాయంగా అందించడం శుభ పరిణామమన్నారు. గడిచిన ఐదేళ్ల కాలంలో నిలిచిపోయిన అమరావతి నిర్మాణం పనుల్లో వేగం పెంచడానికి ఈ నిధులు తోడ్పడతా యన్నారు. అలాగే రైతు జీవనాడిగా ఉన్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పూర్తి ఖర్చు కేంద్రం భరిస్తుందని చెప్పడం వలన ప్రజల ఆశలు చిగురించాయన్నారు. దీంతో రాష్ట్రానికి మేలు జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలో శ్యాంపిస్టన్స్ పరిశ్రమలో పనిచేస్తూ ఇటీవల మరణించిన తోటి కార్మికుడు పంచిరెడ్డి దుర్గాప్రసాద్ కుటుంబాన్ని ఆదుకోవడానికి తోటి కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరాళంగా సేకరించిన రూ.4,16,514 సిఐటియు జిల్లా అధ్యక్షులు సి. హెచ్.అమ్మన్నాయుడు, శ్యాంక్రగ్ పిస్టన్స్ (రింగ్స్) వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గొర్లె కిరణ్ పరిశ్రమ వద్ద బుధవారం అందించారు. దుర్గాప్రసాద్ మరణించడంతో ఆయనకు భార్య, 2 ఏళ్లకుమారుడు, 4 ఏళ్ల కుమార్తె ఉన్నారు. శ్యాంక్రగ్ పిస్టన్స్ రింగ్స్ యూనియన్, సిఐటియు పిలుపు మేరకు తోటి కార్మికులంతా తమ ఒకరోజు వేతనాన్ని విరా ళంగా అందించారు. తోటి కార్మికుడు కుటుంబాన్ని ఆదు కోవడానికి తమ ఒక రోజు వేతనాన్ని విరాళంగా అందించిన కార్మికుల అందరికీ అమ్మన్నాయుడు అభినందనలు తెలిపారు. ఈ విరళాన్ని మరణించిన కార్మికుడు భార్య పి.పావనికి, కుటుంబ సభ్యులకు అందజేశారు. విరాళాన్ని అందజేసిన వారిలో యూనియన్ నాయకులు కూర్మారావు, నాగేశ్వరరావు, జయరాం, ఈశ్వరరావు, రామారావు, తోటయ్య తదితరులున్నారు.

నాటుసారా స్వాధీనం

మెళియాపుట్టి : స్వాధీనం చేసుకున్న సామగ్రితో పోలీసులు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని దారిపేటలో ఎన్‌ఫోర్స్‌మెంట్ టెక్కలి బృందాలు పలాస డిటిఎఫ్ సిబ్బంది సారాతయారీ స్థావరాలపై బుధవారం సంయుక్తంగా టెక్కలి సిఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేయగా 15 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గ్రామ ప్రజలకు నాటుసారా తయారీ వలన కలిగే నష్టాలను తెలిపి సారా తయారీ మానుకోవాలని సూచనలు చేశారు. కార్యక్రమంలో సెబి సిఐ జి.రాజశేఖర్ నాయుడు, పలాస డిటిఎఫ్ సిఐ పి.రామచంద్ర కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

1200 లీటర్ల బెల్లంఊటలు ధ్వంసం

మందస: సోంపేట స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బంది మండలం కొండలోగాం పంచాయతీ పరిధి చాపరాయిలో నాటుసారా తయారీని అరికట్టేందుకు గ్రామ శివార్లలో దాడులు చేపట్టారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. గ్రామంలో ఎవరు నాటుసారా బట్టీలు నిర్వహిస్తున్నారనే కోణంలో విచారణ చేసి వారిపై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో సెబ్ ఎస్ఐ చంద్ర మోహన్, సిబ్బంది కాంతారావు, శాంతరావు పాల్గొన్నారు. నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు ఎవరైనా చేస్తే 9440902358 నెంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.

ఆధార్ నవీకరణ తప్పనిసరి

సచివాలయ సిబ్బంది నుంచి వివరాలు తెలుసుకుంటున్న డిఎల్‌డిఒ

ప్రజాశక్తి- ఆమదాలవలస

గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈనెల 23 నుంచి 27 వరకు చేపడుతున్న ప్రత్యేక ఆధార్ నమోదు శిబిరాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని డిఎల్‌డిఒ, జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల నోడల్ అధికారి వాసుదేవరావు సూచించారు. బుధవారం పురపాలక సంఘం పరిధిలో 2వ వార్డు కృష్ణాపురం సచివాలయంలో జరుగుతున్న ఆధార్ నమోదు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా నమోదు ప్రక్రియ మందకొడిగా సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని సంక్షేమ పథకాలకు ఆధార్ తప్పనిసరి చేసిందని, అందరూ ఆధార్ నవీకరణ తప్పనిసరిగా చేసుకోవాలన్నారు. 0-5 సంవత్సరాల చిన్నారులకు ఆధార్ నమోదు, 5 నుంచి 15 సంవత్సరాల బాల బాలికలకు బయోమెట్రిక్ నవీకరణ, ఆధార్ కార్డు పొంది 10 ఏళ్లు దాటిన వారు వారి నివాస ధ్రువీకరణ పత్రం నవీకరణ (డాక్యుమెంట్ అప్డేషన్), ఆధార్‌కు సెల్ నెంబరు జోడింపు వంటివి తప్పనిసరిగా చేయించుకోవాలని తెలిపారు. లేనిపక్షంలో ఆధార్ ద్వారా పొందే అన్నిరకాల పౌర సేవలకు, ప్రభుత్వ సంక్షేమ ప్రయోజనాలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది నిర్లిప్తత వీడి ప్రజల్లో అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల సిబ్బందితో సమన్వయం చేసుకుని ఆధార్ నమోదు ప్రక్రియ విజయవంతం చేయాలని చెప్పారు. తనిఖీలో ఆమదాలవలస ఎంపిడిఒ వాసుదేవరావు, ఎ.వి.శ్రీనివాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్... ఏడిపించెన్

- తలసేమియా బాలుని ఆక్రందన
- మూడేళ్లుగా పింఛన్ కోసం నిరీక్షణ
- క్షీణిస్తున్న ఆరోగ్యం
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

ప్రజాశక్తి- కవిటి

మండలం వరక గ్రామానికి చెందిన ప్రవీణ్ పురియా(7) జన్మత తలసేమియా వ్యాధితో బాధపడుతున్నాడు. ప్రతి 20 నుంచి 30 రోజులకు ఒకసారి రక్తం ఎక్కించకపోతే అతని ప్రాణానికే ప్రమాదమని వైద్యులు చెప్పారు. రెక్కాడితే గాని డొక్కాడని ప్రవీణ్ తల్లిదండ్రులు శ్రీను పురియా, రాణి పురియా గతంలో హైదరాబాదులో ఉంటూ బాబుకి దాతల సహాయంతో రక్తం ఎక్కించేవారు. రాను రాను పరిస్థితులు అనుకూలించకపోవడంతో స్వగ్రామం చేరుకుని దాతలసాయంతో బాబుకి రక్త మార్పిడి చేస్తున్నారు. అయితే అన్ని సందర్భాల్లో దాతలు అందుబాటులో లేకపోవడంతో కొన్ని సందర్భాల్లో నగదు అవసరమవుతోంది. అయితే ఇటువంటి పిల్లలకు ప్రభుత్వం పింఛన్ అందిస్తుందని తెలిసి మూడేళ్ల క్రితం పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొన్ని సాంకేతిక కారణాలు చూపుతూ బాబుకి ఇప్పటివరకు పింఛన్ మంజూరు కాలేదు. ఓవైపు ప్రాణాలు తోడేస్తున్న అనారోగ్యం, మరోవైపు కుటుంబ ఆర్థిక సమస్యల మధ్య ప్రస్తుతం ప్రవీణ్ సతమతమవుతున్నాడు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి తమను ఆదుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే పింఛన్ తమ బాబుకి రక్తం అందేలా చేస్తుందని ప్రవీణ్ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.

ప్రవీణ్ పురియా

రక్తం ఎక్కిస్తున్న దాతలు

ఆర్థికసాయం అందజేస్తున్న ఆనంద్ తదితరులు

ఆర్థికసాయం అందజేత

పలాస: కాశీబుగ్గ ఇంద్ర కాలనీలో నివాసముంటున్న కోరాడ గౌరీకి రూ.10,500 బుధవారం ఆర్థికసాయం అందజేశారు. గౌరీ అనారోగ్యానికి గురికావడంతో కుడికాలుకు ఆపరేషన్ జరిగింది. ఆమెకు ఎవరూ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గమనించి విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు ఆమెకు తనవంతుగా ఆర్థికసాయం అందజేయాలనే ఉద్దేశంతో వార్డులో ఉన్న మహిళా సంఘ సభ్యులు, టిడిపి నాయకులు చందాలు వేసుకుంటూ ఆమెకు ఆర్థికసాయం అందజేసి ఆదుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ డిక్కల ఆనంద్, టిడిపి నాయకులు నాబెల్లి శ్రీనివాస్, టి.శ్రీనివాస్, రామకృష్ణ, త్రిపురణ శ్రీను, పిడుగు అరుణ్, సర్వవరపు ప్రదీప్, రాయల మల్లి, మార్పు రాజు, సంగారి శ్రీను, పుణ్యవతి, రాజ్యలక్ష్మి, హారతి తదితరులు పాల్గొన్నారు.

అ'విశ్రాంత'... అధ్యాపకుడు

కవిటి: చదువులో ఆసక్తి కలిగిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ, ఆర్థికంగా వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఎల్లవేళలా అండగా నిలిచే కవిటి గ్రామానికి చెందిన విశ్రాంత వృక్షశాస్త్ర అధ్యాపకుడు ప్రగడ వెంకటరమణ విద్యారంగంపై తనకున్న అనుబంధాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపిసి చదువుతున్న 61మంది విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు మాట్లాడుతూ తన విశ్రాంత జీవితం కూడా విద్యాభివృద్ధికి అంకితం చేస్తూ, ఇంకా కొత్తకొత్త విషయాలు తెలుసుకునేందుకు నిరంతరం తాపత్రయపడుతున్న వెంకటరమణ వంటి వారు అరుదుగా ఉంటారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు గొండ్యాల విష్ణుమూర్తి, పి.హరిబాబు, పాపారావు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న శేషగిరిరావు

జిల్లా ఆస్పత్రి పరిశీలన

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు టెక్కలి జిల్లా ఆస్పత్రిని టెక్కలి మండల టిడిపి అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యంలో బుధవారం ఆస్పత్రిని సందర్శించారు. ప్రతి సమస్య డాక్టర్లను, రోగులను అడిగి తెలుసకున్నారు. బగాది శేషగిరిరావు మాట్లాడుతూ మంత్రి అచ్చెన్నాయుడు శాసనసభ సమావేశాలు తర్వాత ఆస్పత్రిని సందర్శించి సమావేశం ఏర్పాటు చేసి మళ్లీ ఆస్పత్రికి పూర్వ వైభవం తీసుకు వస్తారన్నారు. కార్యక్రమంలో టెక్కలి పట్టణ అధ్యక్షులు కోళ్ల లవకుమార్, మెండ దమయంతి, పోలాకి షణ్ముఖరావు, రెయ్యి ప్రీతీష్ చంద్ర, దల్లి ప్రసాద్ రెడ్డి, మల్లిపెద్ది మధు, పొన్నాడ రాజారావు, బుడంకాయల అభిలాష్, సాధు జోగారావు, ప్రఫుల్ల పరిడ, సోడిముడి శివకిరణ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అకడమిక్ కేలండర్ విడుదల

ప్రజాశక్తి- టెక్కలి

విద్యాశాఖ ఈ ఏడాది విద్యా సంవత్సరానికి ఆకడమిక్ కేలండర్ విడుదల చేసింది. ఈ మేరకు ఆగష్టు 1 నుంచి 5 వరకు మెదటి ఫార్మేటివ్ ఎసస్‌మెంట్ పరీక్షలు జరగనుండగా సెప్టెంబర్ 26 నుంచి 30 వరకు రెండవ పార్మేటివ్ ఎసస్‌మెంట్ పరీక్షలు జరగనున్నాయి. నవంబర్ 1 నుంచి 15 వరకు మెదటి సమ్మెటివ్ పరీక్షలు జరగనుండగా, జనవరి 2 నుంచి 6 వరకు మూడవ ఫార్మేటివ్ పరీక్షలు జరగనున్నాయి. పదవ తరగతి విద్యార్థులకు ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 10 నుంచి 20 వరకు జరగనుండగా మార్చి 3 నుంచి 6 వరకు 4 ఫార్మేటివ్ పరీక్షలు జరగనున్నాయి. ఏప్రెల్ 7 నుంచి 18 వరకు సమ్మెటివ్ రెండవ పరీక్షలు అంటే వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 4 నుంచి 13 వరకు దసరా సెలవులు ప్రకటించారు. క్రిస్టియన్ మైనార్టీ సంస్థలకు అక్టోబర్ 11 నుంచి 13 వరకు దసరా సెలవులు ఉంటాయి. డిసెంబర్ 20 నుంచి 29 వరకు క్రిస్మస్ సెలవులు, జనవరి 11 నుంచి 19వ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటిస్తు అకడమిక్ కేలండర్ విడుదల చేశారు.

మాట్లాడుతున్న తేజేశ్వరరావు

వర్గీకరణపై మాట నిలబెట్టుకోవాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

హైదరాబాద్‌లో జరిగిన విశ్వరూప సభలో ఎస్‌సి వర్గీకరణపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు లోపింటి తేజేశ్వరరావు అన్నారు. బుధవారం నగరంలోని పాత శ్రీకాకుళంలో ఎంఆర్‌పిఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెడతామని చెప్పారని, వర్గీకరణపై సుప్రీంకోర్టులో రిజర్వులో ఉన్న తీర్పు వెలువడే అవకాశం ఉందన్నారు. పెద్దసంఖ్యలో ఎస్‌సి ఉప కులాలు సంఘటితమై కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో దాసరి తిరుమల మాదిగ, కంటిపాక. హిమశేఖర్, దీర్ఘాసి తిరుమల, గణబాబు, గొంటి పోలయ్య, బోధల సింహాద్రి, ఎందవ పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఆటలు ఆడుతున్న విద్యార్థులు

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి- కవిటి

క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం కలుగుతుందని బిజి పుట్టుగ, ముత్యాలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బల్లెడ బాబురావు, నాగేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా పాఠశాలల్లో బుధవారం శిక్ష సప్తాహ క్రీడలు నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భవాని ప్రసాద్, వైకుంఠరావు, జానకి, అప్పలరాజు, ఎం.గోపి, నాగమణి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల బస్తా అందజేస్తున్న నాయకులు

ఎరువుల బస్తాలు అందజేత

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం మేఘవరం రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం మరువాడ సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు రైతులకు సబ్సిడీపై ఎరువుల బస్తాలను అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచిందన్నారు. రైతులు ఎరువులను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి సుప్రియ, మేఘవరం టిడిపి నాయకులు రాజశేఖర్ రెడ్డి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్టగొడుగులపై విద్యార్థులకు అవగాహన

పుట్టగొడుగులపై అవగాహన కల్పిస్తున్న అధ్యాపకులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం 5వ సెమిస్టరు చదువుతున్న విద్యార్థులకు బోటనీ లెక్చరర్ టి.బృందావనం బొటానికల్ ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా బుధవారం పుట్టగొడుగులు, అవి పెరిగే పరిస్థితులపై వివరిస్తూ అవగాహన కల్పించారు. పుట్టగొడుగుల్లో రకాలు, విషపూరిత పుట్టగొడుగులకు, ఆహారంగా ఉపయోగపడే పుట్ట గొడుగులకు మధ్య తేడాలను వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.రబిన్ కుమార్ పాడి మాట్లాడుతూ పుట్టగొడుగులు మన ఆరోగ్యానికి మంచి ప్రోటీన్లు, విటమిన్స్ అందిస్తాయని, వర్షాకాలంలో ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పుట్టగొడుగుల వలన ఆరోగ్యానికి మంచి ప్రయోజనాలున్నాయని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

బహుళ పంటలతో అదనపు ఆదాయం

ఆమదాలవలస: మండలంలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులతో వరి పంట సాగులో ప్రధాన పంటతో పాటు రైతులకు అదనపు ఆదాయం సమకూరేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రోత్సహిస్తూ క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎల్‌టు డిజిటల్ సురేష్ మాట్లాడుతూ జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారి రేవతి ఆదేశాల మేరకు వరి సాగుచేసే పొలం గట్లను చదును చేసి వాటిపై బహుళ పంటల కూరగాయలైన బెండ, చిక్కుడు, బీర, ఆనప, వంగ, కంది, బంతి మొక్కలను వేసుకుని సాగు చేయడం వలన రైతు స్వచ్ఛమైన కూరగాయలను పొందడంతో పాటు అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చన్నారు. ప్రస్తుతం రైతులతో

పొలం గట్లపై కూరగాయల విత్తనాలను నాటుతున్న రైతులు

ఎ- గ్రేడ్ మోడల్ పద్ధతిలో బహుళ పంటల సాగును చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిరంజీవి, తిరుపతి, లక్ష్మి, కృష్ణవేణి పాల్గొన్నారు.

హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

సంతబొమ్మాళికి చెందిన గొటివాడ ప్రసన్నకుమార్‌కు కోటబొమ్మాళి మండలం కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంఘ సభ్యులు బుధవారం ఆయన వైద్యఖర్చుల నిమిత్తం రూ.10వేలు అందించారు. ప్రసన్నకుమార్ పెయింటింగ్ పని చేసుకుంటూ 6 నెలల క్రితం పరంజిపై నుంచి జారిపడటంతో కాలుకు ఎక్కువగా గాయలు కావడంతో ఇంటి వద్దనే వైద్య చికిత్స పొందుతున్నారు. ప్రసన్నకుమార్ పనికి వెళ్లకపోవడంతో ఆయన కుటుంబ పోషణ ఇబ్బందికరంగా మారడంతో పాటు నెలవారి వైద్య ఖర్చులు రూ.10 వేలకుపైగా అవుతున్నాయన్నారు. దాతలు ముందుకు వచ్చి ప్రసన్నకుమార్‌కు సహాయం

ప్రసన్నకుమార్‌కు ఆర్థికసాయం అందజేస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

చేయాలని హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు జీరు రామకృష్ణ, గంగులు, కూచెట్టి భానుప్రకాష్, రాము, రాజు, శ్రీను, రవి, సంతు, ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పశువులకు టీకాలు తప్పనిసరి

పాతపట్నం: నాలుగు మాసాలు దాటిన ఆవుజాతి దూడలు, పెద్ద పశువులకు ముద్దపు చర్మవ్యాధి నివారణ టీకాలు కచ్చితంగా వేయించుకోవాలని పాతపట్నం ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్‌రావు అన్నారు. పాతపట్నంలో జరుగుతున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముద్దపు చర్మవ్యాధి సోకితే పాడి రైతుకు ఆర్థికంగా తీవ్ర నష్టం వాటిల్లుతుందని, పాల దిగుబడి గణనీయంగా తగ్గి రైతుకు ఆర్థికంగా దెబ్బ తగులుతుందన్నారు. ఈ వ్యాధి ఉధృతంగా ఉంటుందని, వ్యాధి తీవ్రత ఎక్కువైతే మరణాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. పశు పెంపకందారులు గ్రామాల్లో పశువైద్య సిబ్బంది వచ్చినప్పుడు వారికి సహకరించి ఈ టీకాలు

పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

వేయించు కోవాలన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 20 నుంచి ఆగస్టు నెల 18 వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది కుమారి, విజయ్ కుమార్, మోహన్, నారాయణ ట్రైనీ, పశువైద్య సహాయకులు చరణ్, ప్రదీప్, సౌజన్య పాల్గొన్నారు.

విజ్ఞానాన్ని నేర్పేది గురువు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

శిష్యుల్లో ఉండే అజ్ఞానాన్ని తొలగించి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దేవాడే గురువని ప్రముఖ వయోలిన్ విద్యాంసులు డాక్టర్ సుసరాపు లక్ష్మీగణపతిశర్మ అన్నారు. నగరంలోని ఇందిరావిజ్ఞాన్ మందిరంలో గురుపూజోత్సవాన్ని పురష్కరించుకుని ప్రముఖ నృత్యదర్శకులు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్‌ను బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాంత్ ఎంతో మంది విద్యార్థులను గొప్ప నృత్య కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. దేశ, విదేశాల్లో కూచిపూడి నృత్య ప్రదర్శనలిస్తూ జిల్లా ఖ్యాతిని ఇనుమడింప జేస్తున్నారన్నారు. శ్రీకాంత్‌కు ఆధ్యాత్మిక భావనతో పాటు,

శ్రీకాంత్‌ను సత్కరిస్తున్న వయోలిన్ విద్వాంసులు

మూగజీవాలపై అమితమైన ప్రేమాభిమానాలు ఉన్నాయన్నారు. అనంతరం పలువురు శ్రీకాంత్‌ను దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. కార్యక్రమంలో శ్రీసాయి నృత్య కళానికేతన్ విద్యార్థులతో పాటు రిమ్స్ అభివృద్ధి కమిటీ మెంబర్ లావేటి శ్యామ్‌సుందరరావు, విజయ్ భాస్కర్, నరేష్ (స్వామి), సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి- రణస్థలం

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంఇఒ-2 బి.లావణ్య సూచించారు. రణస్థలం ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం శిక్షా సప్తాహేలో భాగంగా క్రీడాదినోత్సవం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆమె హాజరై మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలన్నారు. విద్యార్థులు క్రీడల్లో రాణించి దేశానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ముందుగా చదరంగం, వైకుంఠ పాళీ తదితర ఆటలను ఆడించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామకృష్ణ, పిఇటి జ్ఞానేశ్వరీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లి దండ్రులు

ఆటలు ఆడిస్తున్న ఎంఇఒ లావణ్య

తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీ ధర్నాలో రెడ్డి శాంతి

పాతపట్నం: ఎపిలో వైసిపి కార్యకర్తలు, సానుభూతి పరులపై టిడిపి దాడులు చేస్తుందని ఇటువంటి దుశ్చర్యలు ఆపడానికి వైసిపి అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి బుధవారం ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో వైసిపి మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో పాటు పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తనయులతో సహా కలిసి పాల్గొన్నారు.

భోజనాలను పరిశీలిస్తున్న బాలాజీ

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

పాతపట్నం: డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను శనివారం సాంఘిక సంక్షేమ గురుకుల జిల్లా సమన్వయ అధికారి ఎన్.బాలాజీ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యా ర్థులకు అందిస్తున్న భోజనాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అదే విధంగా విద్యార్థినుతో మాట్లాడి అందరూ ఇప్పటి నుండే బాగా చదివి మంచి ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈయనతో పాటు ప్రిన్సిపాల్ అర్చన, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

నేత్రవైద్య శిబిరానికి స్పందన

మందస: జిల్లా అంధత్వ నిర్మూలన సంస్థ సౌజన్యంతో హరిపురం మార్పు పద్మనాభం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిచే బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ నేత్ర వైద్య సహాయకులు జె.పవిత్ర 110 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించి 45 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరం ఇన్‌ఛార్జి, టి.రామారావు, మెమోరియల్ ట్రస్ట్ గౌరవ అధ్యక్షులు మట్ట ఖాగేశ్వర్‌రావు, సన్నశెట్టి రాజశేఖర్ హాజరయ్యారు. శిబిరానికి వచ్చిన కంటి రోగులకు మజ్జిగ, మంచినీళ్లు, పులిహోర అందించారు.

ఎమ్మెల్యే సతీమణి పరామర్శ

శ్రీకాకుళం రూరల్: మండలం ఒప్పంగిలో ధర్మాన ముసలినాయుడు అనారోగ్య కారణంగా మరణించిన విషయం తెలుసుకున్న శ్రీకాకుళం నియోజకవర్గ తెలుగు మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్యే సతీమణి గొండు స్వాతి బుధవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

మాట్లాడుతున్న స్వాతి

దాతల సహకారం అవసరం



జగన్‌ను అభినందిస్తున్న కమిటీసభ్యులు

ప్రజాశక్తి- కవిటి

బెహరా వీధిలో పునర్నిర్మిస్తున్న శ్రీ జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి దాతల సహకారం ఎంతో అవసరమని వక్తలు అన్నారు. గ్రామానికి చెందిన మండల జగన్ ఆలయ నిర్మాణానికి తనవంతుగా 6 వేల ఇటుకలు, 50 సిమెంట్ బస్తాలు బుధవారం వితరణగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి కలిగిన జగన్నాథ స్వామి ఆలయ నిర్మాణానికి దాతలు ఉదారంగా విరాళాలు అందించాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందించారు. కార్యక్రమంలో డి. దుర్యోధన, ఎన్.కృష్ణ, ఎం.సీతాలు, పి.ఉమామహేశ్వరరావు, తిరుపతి బెహరా, ఖగపతి బెహరా, గౌతమ్ బెహరా, ప్రేమానంద్ తదితరులు పాల్గొన్నారు.

వరి నాట్లలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రైతులు వరినాట్లులో వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయాధికారి భార్గవి అన్నారు. బుధవారం మండలంలో వ్యవసాయాధికారి, యూనిట్ ఇన్‌ఛార్జి మద్దిల చిట్టిబాబు ఆధ్వర్యంలో రైతులకు వరినాట్లు లైన్ షోయింగ్‌పై, కాలి బాటలపై యాజమాన్య సస్యరక్షణపై అవగాహన కల్పించారు. ఖరీఫ్‌లో రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

సూచనలు చేస్తున్న వ్యవసాయాధికారి భార్గవి

కార్యక్రమంలో విఎఎ వెంకట్, సర్పంచ్ ఆశీ మాధవరావు, గ్రామపెద్దలు, రైతులు, సిబంది నాగమణి, కుమారి, కృష్ణవేణి, రూప పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

వీల్‌చైర్ అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని కృష్ణాపార్క్ వద్ద అంగవైకల్యంతో బాధపడుతూ, ఒంటరిగా యాచన చేస్తూ కాలం గడుపుతున్న అచ్యుతరావుకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన వీల్‌చైర్ అందజేశారు. బుధవారం ఆయనను రెడ్‌క్రాస్ కార్యాలయానికి తీసుకెళ్లి సపర్యలు చేసిన అనంతరం కొత్తబట్టలు, వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో నంది ఉమా శంకర్, జి.పవన్ కుమార్ పాల్గొన్నారు.

హౌసింగ్ కార్యాలయానికి దారేది?

లావేరు: మండల కేంద్రంలో ఉన్న మండల హౌసింగ్ కార్యాలయానికి వెళ్లాలంటే గుండెలు పట్టుకుని వెళ్లాల్సిన పరిస్థితి. కార్యాలయ ప్రాంగణమంతా ముళ్ల పొదలు, పిచ్చిమొక్కలు నాలుగు అడుగుల పైబడి పెరిగి ఉన్నా కనీసం ఎవరూ పట్టించుకోకపోవడంతో కార్యాలయానికి పనిమీద వెళ్లేవారు దారిలేక అడవిలా కనపడడంతో భయపడుతున్నారు. అసలే వర్షాలు పడడంతో పాములు, విష కీటకాలతో ఏ ప్రమాదం వస్తోందోనని భయ పడుతున్నారు. అధికారులు కార్యాలయ ఆవరణలో పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హౌసింగ్ కార్యాలయ ఆవరణలో ఉన్న పొదలు, పిచ్చిమొక్కలు

పాఠశాలకు అందజేసిన ప్యూరిఫైర్‌తో ఉపాధ్యాయులు

వాటర్ ప్యూరిఫైర్ వితరణ

పొందూరు: మండలంలోని గోరింటకు చెందిన కూన చిరంజీవిరావు తాడివలస ఉన్నత పాఠశాలకు సుమారు రూ.18 వేలు విలువ చేసిన వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణగా అంద జేసినట్లు హెచ్‌ఎం బల్ల కంటయ్య తెలిపారు. దీనిని బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఈయన కుమార్తె కూన హిమబిందు ఇదే పాఠశాలలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల్లో 553 మార్కులతో ఉత్తీర్ణత సాధించినందుకు ఈ వాటర్ ప్యూరిఫైర్‌ను వితరణగా అంద జేశారన్నారు. పూర్వ విద్యార్థుల సహకారం అవసరమని, ప్యూరిఫైర్ అందజేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.

దీక్షల్లో పాల్గొన్న బెంతు ఒరియా ప్రతినిధులు

అలుపెరుగని పోరాటం

కవిటి: కుల ధ్రువీకరణ పత్రాలు, తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో సాగిస్తున్న అలుపెరుగని పోరాటం 211వ రోజుకి చేరుకుంది. అందులో భాగంగా బుధవారం దీక్షలో యువత పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించే వరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

వేలం నిర్వహిస్తున్న ఇఒ చంద్రశేఖర్

అరసవల్లి తలనీలాల వేలం ఖరారు

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తలనీ లాల వేలం బుధవారం నిర్వహించారు. ఆరు నెలల పాటు సేకరించిన 576 కిలోల తలనీలాలు రూ.34,18,560 ధరకు వేలం ఖరారు చేశారు. దేవాలయం అనివెట్టి మండపంలో ఆలయ ఇఒ చంద్రశేఖర్, శ్రీకూర్మం దేవస్థానం ఇఒ గురునాథం ఆధ్వర్యాన వేలం టెండరు నిర్వహిం చారు. తలనీలాల వేలంలో 11 మంది పాటదారులు పాల్గొన్నారు. ఏలూరుకు చెందిన శ్రీవల్లీ ఎంటర్ ప్రైజస్ సంస్థ కిలో కొప్పు రూ.5,935 ధరకు పాడుకున్నారు. హెచ్చు పాటదారులైన ఈ సంస్థకు వేలాన్ని ఖరారు చేస్తున్నట్టు ఇఒ ప్రకటించారు.

ఆరుబయట వంటలతో అవస్థలు

పొందూరు: కట్టెలపై ఆరుబయట మహిళలు వంటలు చేస్తూ అవస్థలు పడుతున్న ఈ దృశ్యం మండలంలోని వావిలపల్లిపేట వద్ద ఆదర్శ పాఠశాలలోనిది. ఇక్కడ ఆదర్శ పాఠశాలను ఏర్పాటు చేసి దశాబ్దం అవుతున్నప్పటికీ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వండేందుకు నిర్వాహకులు నానా తంటాలు పడాల్సిందే. వంట చేసేందుకు వంటశాల లేకపోవడంతో ఆరుబయట కట్టెలతో వంటలు చేయాల్సిన పరిస్థితి నిర్వాహకులది. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు ఆ వర్షపునీటిలోనే వంటలు చేయాలి. కనీసం గ్యాస్ కూడా లేకపోవడంతో వర్షానికి తడిసిన కట్టెలతో మంట పెట్టి వంటలు చేసేందుకు నానా తంటాలు పడుతున్నారు. వంటశాల నిర్మాణానికి సంబంధిత అధికారులు ఎటువంటి చర్యలు చేపట్టక పోయినప్పటికీ వంటలు చేసి విద్యార్థులకు సకాలంలో భోజనం పెట్టేందుకు ఆ మహిళలు ఎంతగానో శ్రమిస్తున్నారు.

ఆదర్శ పాఠశాల వద్ద ఆరుబయట వంటలు చేస్తున్న మహిళలు

అధ్వాన రహదారితో ఇబ్బందులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణ శివారున సిఎస్‌పి రహదారి అధ్వానంగా ఉండడంతో ప్రయాణించడానికి వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణ శివారున ఉన్న ఫ్లై ఓవర్ దిగువ నుంచి మండాది వరకు ఐదు కిలోమీటర్ల రహదారిని వైసిపి ప్రభుత్వ హయంలో సుమారు రూ.కోటి పైచిలుకు నిధులతో నిర్మించారు. అప్పట్లో స్పీకర్ తమ్మినేని సీతారాం కుమారుడి వివాహానికి సిఎం జగన్మోహన్ రెడ్డి రోడ్డు మార్గం గుండా వస్తారని రోడ్లు భవనాల శాఖ అధికారులు ఆదరా బాదరాగ నియమ నిబంధనలు పక్కనపెట్టి వర్షం కురుస్తుండగా నాణ్యతలేని రహదారి నిర్మాణం పూర్తి చేశారని అప్పట్లోనే పలు పత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. రహదారి నిర్మాణం పూర్తయినప్పటి నుంచి రహదారిపై తరచూ గోతులు ఏర్పడడం ఆర్‌అండ్‌బి అధికారులు గుత్తేదారుతో గోతులను పూడ్చడం, మళ్లీ నెల రోజులకే ఆ గోతులు యధావిధిగా మామూలు స్థితికి రావడం, అదే రహదారిపై ఇబ్బందులు పడుతూ ప్రయాణాలు కొనసాగించడం వాహనదారులు, ప్రజలకు అలవాటుగా మారిపోయిందని పలువురు చెబుతుండడం విశేషం. ఇదే రహదారిపై నిత్యం వేల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలను తప్పించబోయి ప్రమాదాల బారిన పడుతున్నామని వాహన చోదకులు చెబుతున్నారు. అధ్వానంగా తయారైన రహదారిపై ప్రయాణించాలంటే అర చేతిలో ప్రాణాలను పెట్టుకొని ప్రయాణాన్ని కొనసాగిస్తున్నామని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు రహదారిపై ఉన్న గుంతలు నీటితో నిండి ఉండడం వలన ద్విచక్ర వాహనదారులు గుంతలను గుర్తించలేక ప్రమాదాల బారిన పడు తున్నామని, రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు. పాలకులు మారినా రహదారి తీరు మారలేదని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రహదారిపై ఉన్న గుంతలను పూడ్చి ప్రమాదాల నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

సిఎస్‌పి రహదారిపై ఏర్పడిన గుంతలు